క్లుప్తంగా

నేడు ఊనగట్లలో 'ప్రజాశీర్వాదం'

కొవ్వూరు: చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రజాశీర్వాదం పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. కావున నియోజక వర్గంలోని పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ పూజల్లో భక్తులు

నల్లజర్ల: అనంతపల్లిలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉదయం గోపూజ, విష్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, ఋత్విక వరుణ దీక్షా ధారణ, అగ్ని ప్రతిష్ఠాపన, చతుర్విధ స్వస్తి, తీర్థప్రసాద వితరణ వంటి క్రతువులు వేదపండితులు పెదపూడి విజయవెంకటరమణ, వాడపల్లి శశికాంతాచార్యులు, కాశీభట్ల రాంగోపాల్‌శర్మ, దివిపాండురంగ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ద్వారకాతిరుమల భవానీ భజనమండలి, ప్రసన్నవిఘ్నేశ్వర భజన మండలి సభ్యులు భజన చేశారు.

కొనసాగుతున్న ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు



బసివిరెడ్డిపేటలోని వేంకటేశ్వర స్వామి నూతన ఆలయం వద్ద హోమాలు చేస్తున్న రుత్విక్కులు

కొవ్వూరు: స్థానిక బసివిరెడ్డిపేటలో కొత్తగా నిర్మించిన రాజ్యలక్ష్మీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి జీర్ణోద్ధరణ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో రుత్విక్కులు హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఐదో తేదీ వరకూ వివిధ రకాల హోమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, దేవస్థానం చైర్మన్‌ దేవగుప్తాపు లక్ష్మణరావు, పద్మ దంపతులు సోమవారం తెలిపారు. ఐదో తేదీ ఉదయం 9.26 గంటలకు త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌ స్వామి, త్రిదండి అహోబల రామానుజ జీయర్‌ల పర్యవేక్షణలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. ఆరో తేదీన మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళల్లో మార్పు

నిడదవోలు రూరల్‌: కాటకోటేశ్వరంలోని 11 కేవీ విద్యుత్తు సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకూ వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళల్లో మార్పులు చేసినట్టు ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూరాపురం, కలవలపల్లి గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా విద్యుత్తును సరఫరా చేస్తామన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రంగా వెంకటేశ్వరరావు, లయన్స్‌ క్లబ్‌ సభ్యులు

నిడదవోలు: రంజాన్‌ మాసం సందర్భంగా స్థానిక పెద్ద మసీదు వద్ద లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. రంగా సుబ్బారావు, సత్యవతి దంపతుల కుమారుడు లయన్‌ రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 80 మంది పేదలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్‌ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్‌ ఎస్‌కే వజీరుద్దీన్‌, ముతవల్లి అజీజ్‌బాషా, ఎస్‌కే జహంగీర్‌ బాషా, సాగి వెంకటరాజు, కె. అచ్చియ్య, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

బైక్‌ చోరీపై కేసు

కొవ్వూరు: పట్టణ శివార్లలోని జగనన్న కాలనీలో ఇంటి బయట పార్కింగ్‌ చేసిన పల్సర్‌ మోటార్‌ సైకిల్‌ మార్చి 28న చోరీకి గురైంది. దీనిపై బాధితుడు కోటాన సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై ఎండీ జువేర్‌ తెలిపారు.

అమ్మో నిమ్మ.. రేటెక్కువ

- కిలో కాయలు రూ.65
- మార్కెట్‌కు సరకు అంతంత మాత్రంగా సరఫరా
- నల్లజర్ల నుంచి బీహార్‌, ఒడిశా, కోల్‌కతాకు ఎగుమతి



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయల బస్తాలు

నల్లజర్ల: నిమ్మ రైతుకు మంచి రోజులు వచ్చాయి. నిన్న,మొన్నటి వరకూ అంతంత మాత్రంగా ఉన్న నిమ్మకాయల ధరలు ఇప్పుడు పెరిగాయి. మండలంలోని దూబచర్ల పరిసర గ్రామాల రైతులు నిత్యం తమ తోటల్లోని నిమ్మకాయలను కోసి బస్తాల్లో మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక దశలో కిలో ధర రూ.80 వరకూ వెళ్లినా ప్రస్తుతం రూ.65 వద్ద నిలకడగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. నల్లజర్ల మార్కెట్‌లో మేలురకం నిమ్మ కాయలు కిలో రూ.65, నాసిరకం కాయలు కిలోకు రూ.55కు వెళ్లినట్టు పుల్లలపాడు రైతు అల్లూరి చిన భాస్కరావు తెలిపారు. ఒకపక్క ఎండలు తీవ్రతరం కావడం, బయట మార్కెట్‌లలో డిమాండ్‌ పెరగడం వంటి కారణాల వల్ల మొన్నటి వరకూ కిలో రూ.50, రూ.40 ఉన్న నిమ్మకాయల ధర నాలుగు రోజుల క్రితం రూ.70కి పెరిగింది. ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ మార్కెట్‌కు సరుకు మాత్రం అంతంమాత్రంగానే వచ్చింది. ఆశించినంతగా దిగుబడి లేకపోవడమే ఇందుకు కారణం. ఇక్కడి నుంచి బీహార్‌, ఒడిశా, కోల్‌కతా మార్కెట్లకు నిమ్మకాయలను ఎగుమతి చేస్తున్నట్టు



తోటలోనే నిమ్మకాయలు గ్రేడింగ్‌ చేస్తున్న కూలీలు

కమిషన్‌దారుడు ఓంకారపు రాము వివరించారు. ఇటీవల వరకూ ఈశాన్య రాష్ట్రాల్లో మంచు కురవడం, చలి వాతావరణం ప్రభావం వల్ల నిమ్మ ధరలు పడిపోయాయని, ప్రస్తుతం ఎండలు పెరగడంతో నిమ్మకు గిరాకీ పెరిగినట్టు వెల్లడించారు. ఉగాది, రంజాన్‌ పండుగల నేపథ్యంలో ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. వారం నుంచే ధరలు బాగున్నాయన్నారు. ఢిల్లీ మార్కెట్‌కు కాయలు వచ్చే భావనగర్‌, మహారాష్ట్రలోని బీజాపూర్‌, మన రాష్ట్రంలోని ఏలూరు, రాజమహేంద్రవరం, తెనాలి, నెల్లూరు, గూడూరు, పాదలకూరులలో కూడా ఈ ఏడాది నిమ్మకాపు తక్కువగా ఉంది. ఈ పరిస్థితులు కూడా ధరలు పెరగడానికి కారణంగా చెబుతున్నారు. మూడేళ్లుగా ఈ సీజన్‌లో నిమ్మకాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు నష్టాల నుంచి బయట పడుతున్నారు. నవంబర్‌లో కురిసిన అకాల వర్షంతో నిమ్మ చెట్లకు ఉన్న పూతరాలి పోయింది. అందు చేతే ఈ ఏడాది కాపు అంతంత మాత్రంగా ఉందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. నార్త్‌ ఢిల్లీ, సౌత్‌ చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్‌ ప్రాంతాల నుంచి కాయలు కావాలని ఇక్కడి వ్యాపారులకు ఆర్డర్లు వస్తున్నాయి.

ఆనందంగా ఉన్నాం



ఈ ఏడాది నిమ్మధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఏటా ధరలుంటే దిగుబడులు ఉండేవి కావు. ఈ ఏడాది దిగుబడులు కూడా కొంత బాగానే ఉన్నాయి. ధరలు బాగున్నాయి. గత రెండేళ్ళుగా ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రైతులు నష్టాల ఊబి నుంచి బయటపడనున్నారు.

అల్లూరి చిన భాస్కరరావు, రైతు, పుల్లలపాడు

ఎప్పుడూ ఇంత రేటు చూడలేదు



నిమ్మధరలు ఈ ఏడాది ఇంత ధరలు ఎప్పుడూ చూడ లేదు. ప్రస్తుతం ఉన్న ధరలు కొన్నిరోజుల పాటు నిలకడగా ఉంటే రైతులు గట్కెక్కుతారు. గత 15 రోజులుగా ఆశించిన ధరలు రావడం రైతులకు ఊరటగా ఉంది.

– చిగురుపాటి సోమరాజు, రైతు, ముసుళ్లగుంట

శ్రీనివాస్‌ నాయుడి తరఫున ప్రచారం



మల్లేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు వరుణ్‌ సాయి

పెరవలి: వైఎస్సార్‌ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌ నాయుడి తరఫున ఆయన కుమారుడు వరుణ్‌ సాయి సోమవారం మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. పింఛన్‌ వస్తోందా? రైతు భరోసా అందిందా? సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో నిడదవోలు నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తయారు చేస్తారన్నారు. ప్రచారంలో మల్లేశ్వరం సర్పంచ్‌ బొలిశెట్టి రత్నమాల, వైఎస్సార్‌ సీపీ నాయకులు బొలిశెట్టి పట్టాభి, నాయకులు పాల్గొన్నారు.

మంచి చేస్తేనే ఓటు వెయ్యండి

- సీఎం జగన్‌ నినాదంలోని చిత్తశుద్ధిని గుర్తించండి
- ప్రచారంలో మంత్రి తానేటి వనిత



తొక్కిరెడ్డిగూడెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తానేటి వనిత

గోపాలపురం: ప్రభుత్వం నుంచి మీ కుటుంబానికి మేలు జరిగితేనే తనకు ఓటు వేయమని ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి తప్ప దేశంలోని మరే నాయకుడూ అడగలేదని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. మండలంలోని భీమోలు సచివాలయం పరిధిలోని భీమోలు, తొక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో సోమవారం మంత్రి వనిత ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సును గుర్తించిన వ్యక్తి జగన్‌ మాత్రమే అన్నారు. గత పాలకులు తమ సొంత ప్రయోజనాలను తప్ప ప్రజల గోడు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి పాటు పడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్న జగన్‌పై లేని పోని ఆరోపణలు చేస్తున్న విపక్షాలకు ప్రజలే బుద్ధిచెబుతారని ఆమె పేర్కొన్నారు. ప్రచారంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్‌ యండపల్లి కవిత, సర్పంచ్‌ అన్నెపు వెంకటలక్ష్మి, నాయకులు ఎస్‌కే వల్లీ, వెలగా శ్రీరామమూర్తి, కాకులపాటి శ్రీను, గెల్లా వెంకట శ్రీను, బండారు జగన్‌మోహన్‌రావు, కొడమంచిలి విజయ్‌ కుమార్‌, సాలి వేణు పాల్గొన్నారు.

వలంటీర్లు పెన్షన్లు ఇవ్వరా? అని అడుగుతున్నారు

- అది వింటే బాధేస్తోంది
- వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- తిమ్మరాజుపాలెంలో ఇంటింటా ప్రచారం



తిమ్మరాజుపాలెంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల కర పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్‌: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ కుట్రల వల్ల ఈ నెలలో వలంటీర్లు పెన్షన్లు ఇవ్వకుండా చేశారన్నారు. ఇంటింటి ప్రచారంలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తమకు పెన్షన్లు వలంటీర్లు ఇవ్వరా? అని అడుగుతుంటే బాధ కలుగుతోందన్నారు. నిస్వార్థంగా సేవచేసే వలంటీర్లకు రాజకీయం అంటగట్టి లబ్ధిదారులపై కక్ష తీర్చుకోవడం ఎంతవరకూ సబబు అని టీడీపీని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్‌ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ వెలగన పోలయ్య, సర్పంచ్‌ ముప్పిడి చంద్రశేఖర్‌, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ నాయకులు అయినీడి వెంకటకృష్ణ, పడాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి

- ఓటింగ్‌ శాతం పెంపునకు చర్యలు తీసుకోవాలి
- సబ్‌ కలెక్టర్‌ అశుతోష్‌ శ్రీవాస్తవ్‌ ఆదేశం
- కొవ్వూరులో ఎన్నికల సిబ్బందికి శిక్షణ



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ అశుతోష్‌ శ్రీవాస్తవ్‌

కొవ్వూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయని వారి (ఆబ్సెంట్‌ ఓటర్లు)ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, సబ్‌ కలెక్టర్‌ అశుతోష్‌ శ్రీవాస్తవ్‌ సూచించారు. హోం ఓటింగ్‌, ఆబ్సెంట్‌ ఓటర్ల గుర్తింపు, తదుపరి కార్యాచరణపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుందర సాయి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సెక్టార్‌ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్‌ లెవెల్‌ అధికారులు హాజరయ్యారు. సబ్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌ శాతం పెంచడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ఎన్నికల కమిషన్‌ తీసుకున్న చర్యల్లో భాగంగా 85 ఏళ్లు నిండిన వృద్ధులు, నలభై శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 578 మందిని, 40 శాతానికి పైబడి వైకల్యం ఉన్న ఓటర్లు 2,393 మందిని గుర్తించామన్నారు. వీరంతా పోలింగ్‌ కేంద్రానికి వచ్చి ఓటు వేయవచ్చని, లేదంటే తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్‌ కేంద్రానికి రాలేని వారు ఫారం–12 డి ద్వారా బీఎల్‌వోల నుంచి అంగీకార పత్రం తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. దీనిపై బీఎల్‌వోలు, ఇతర అధికారులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని సబ్‌ కలెక్టర్‌ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే పీవోలు, ఏపీవోలు, అనుబంధ సిబ్బంది, రిజర్వుడు సిబ్బంది 1,309 మందికి పోస్టల్‌ బ్యాలెట్‌ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వారు ఫారం–12 డి ద్వారా డిక్లరేషన్‌ పొందాల్సి ఉంటుందన్నారు. పోస్టల్‌ బ్యాలెట్‌, ఆబ్సెంట్‌ ఓటింగ్‌, హోం ఓటింగ్‌లపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. సహాయ రిటర్నింగ్‌ అధికారి కె.మస్తాన్‌, చాగల్లు, తాళ్లపూడి తహసీల్దార్లు ఎం.సావిత్రి, సీహెచ్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

దేవరపల్లి: ఈ ఏడాది నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్‌ పరీక్షలో మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓలు ఎం.తిరుమలదాస్‌, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. దేవరపల్లి మండల ప్రాథమిక (మెయిన్‌) పాఠశాల నుంచి తంగెళ్ల యశస్విని, గాంధీనగరం మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల నుంచి ఉండవల్లి మోక్షితాదేవి, దుద్దుకూరు జెడ్పీ హైస్కూల్‌ నుంచి కడిమి గుణశేఖర్‌ ఎంపికైనట్టు తిరుమలదాస్‌ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంఈఓలు అభినందించారు.

గవర్లపాలెం నుంచి మోహన్‌ సిద్విక్‌..

పెరవలి: మండలంలోని గవర్లపాలెం పాఠశాల విద్యార్థి జి.మోహన్‌ సిద్విక్‌ నవోదయ ఎంట్రన్స్‌ పరీక్షలో ఉత్తీర్ణుడై, ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడని ఎంఈఓ సూర్జహాన్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ సోమవారం గవర్లపాలెం పాఠశాలకు వెళ్ళి మోహన్‌ను, అతడికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

జగన్‌ సీఎంగా ఉంటేనే సక్రమంగా పథకాలు

- వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ గూడూరితో కలసి ఊనగట్లలో ప్రచారం



ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డే కొనసాగాలని ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. ప్రజాశీర్వాద కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మండలంలోని ఊనగట్ల గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌ కూడా పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో వారిద్దరూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా చిరునవ్వుతో తమను ఆహ్వానిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్‌ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్‌ మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ ఆత్కూరి గోపీచంద్‌, నాయకులు పిల్లి నాగరాజు, కంకటాల శ్రీనివాస్‌, వీరవల్లి శివ, వీరవల్లి సత్యనారాయణ, చిక్కం నర్సింహమూర్తి, మెరిపో సూర్యచంద్రం, వి.కిషోర్‌, అడపా ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

- మున్సిపల్‌ చైర్మన్‌ భూపతి ఆదినారాయణ
- రాయిపేటలో ముమ్మరంగా ప్రచారం



నిడదవోలు 14వ వార్డులో కరపత్రాలను అందిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఆదినారాయణ, పార్టీ శ్రేణులు

నిడదవోలు: వైఎస్సార్‌ సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్‌ చైర్మన్‌ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో 14వ వార్డు రాయిపేటలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్‌ గుర్తుకు ఓట్లు వేసి నిడదవోలు ఎమ్మెల్యేగా మళ్లీ జి.శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటివరకూ అందించిన సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, గాజుల రంగారావు, కౌన్సిలర్లు బిర్రె పార్వతి, గోపిరెడ్డి శ్రీనివాస్‌, ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు, దాకే అనిల్‌కుమార్‌, పార్టీ నాయకులు గంగుల గోపియాదవ్‌, తోలేటి కోటేశ్వరరావు, విపర్తి కిషోర్‌, అడపా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి వనిత పరామర్శ



యర్నగూడెంలో నరహరిశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వనిత

దేవరపల్లి: యర్నగూడెంలో ఇటీవల ఇద్దరు మరణించారు. వారి కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్‌ నరహరిశెట్టి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మంత్రి తానేటి వనిత పరామర్శించారు. అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన నల్లం గణేశ్వరి కుటుంబ సభ్యులను కూడా మంత్రి వనిత పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్‌ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర పామాయిల్‌ బోర్డు డైరెక్టర్‌ నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ కూచిపూడి సతీష్‌, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పోతుల కనకరాజు, సర్పంచ్‌ బొంతా భరత్‌బాబు మంత్రి వనిత వెంట ఉన్నారు.

గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



త్యాజంపూడిలో సచివాలయ కార్యదర్శి రాణికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న గ్రామ వలంటీర్లు

దేవరపల్లి: పింఛన్లు, ఇంటింటికీ రేషన్‌ పంపిణీకి తమను దూరం పెడుతూ ఎన్నికల కమిషన్‌ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. మండలంలోని త్యాజంపూడి గ్రామ సచివాలయం పరిధిలోని ఎనిమిది మంది వలంటీర్లు సోమవారం ఆ గ్రామ సచివాలయ కార్యదర్శి రాణికి తమ రాజీనామా పత్రాలు అందజేసి వెంటనే ఆమోదించాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లు నిరసన తెలిపారు. పాల సుగుణ కుమారి, దావాల వీరతేజ, అరిగెల రామ పరమేశ్వరి, పట్టపుశెట్టి పెద్దింట్లమ్మ, విపర్తి మధుబాబు, గంజి సమీర, మానుపాటి లక్ష్మి, చిటికిన సౌజన్య రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. తదుపరి చర్యల నిమిత్తం రాజీనామా పత్రాలను ఎంపీడీవో డీబీఆర్‌ కృష్ణంరాజుకు అందజేసినట్టు కార్యదర్శి ఎం. రాణి తెలిపారు.